క్లుప్తంగా

నేడు తిరుకల్యాణోత్సవం



శ్రీపద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామివారు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వెంకటగిరి కొండపై వేంచేసి ఉన్న శ్రీలక్ష్మీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివార్ల ఆలయంలో 24వ తిరుకల్యాణ మహోత్సవం శనివారం ఉదయం 9.45 గంటలకు జరుగుతుందని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త కామిని వెంకట రామప్రసాద్‌చౌదరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మహోత్సవం తిరుమల తిరుపతి దేవస్థానం వార్షిక సత్కార పండితుడు కాళ్లకూరి సూర్యశ్రీ (సూరిపండు), ఆలయ ప్రధాన అర్చకుడు నండూరి శ్రీకృష్ణపరమాత్మ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన ముంగి నాగేశ్వరరావు కుమారుడు ముంగి గిరిధరరావు, సుజాతరాణి దంపతులచే తిరుకల్యాణం జరుగుతుందన్నారు. ఉదయం 5.30 గంటల నుంచి విఘ్నేశ్వరపూజతో ప్రారంభమై, స్వామివారిని పంచామృతస్నాపన, తిరుమంజనం అనంతరం ప్రత్యేక అలంకరణ, దర్శనం, అగ్ని ప్రతిష్ఠాపన, మధ్యాహ్నం లక్షతులసి పూజ, సాయంత్రం పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు జరుగుతాయని రామప్రసాద్‌చౌదరి వివరించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రంగంపేట: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్‌ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాత వీరంపాలెం గ్రామం శివారులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా గుర్తు తెలియని వ్యక్తి పూర్తిగా కాలిపోయి ఉన్నాడని స్థానికులు కూడా గుర్తుపట్టకపోవడంతో గ్రామ వీఆర్వో లీలావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

రాజానగరం: పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. దివాన్‌చెరువు– 2 గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి, నాలుగున్నరేళ్ల నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ మేరకు అందాయి, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఏ ఏ కుటుంబానికి ఎంత ప్రయోజనం చేకూరిందనే విషయాన్ని కరపత్రాల ద్వారా వివరించారు. రాష్ట్రంలో ప్రజలంతా బాగుండాలని, పేదరికంతో ఎవరూ బాధపడకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'నవరత్నాలు' పేరుతో సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే రాజా అన్నారు. మునుపెన్నడూ లేని అభివృద్ధి నేడు కళ్లెదుట కనిపిస్తుందన్నారు. గ్రామాలు సర్వతోముఖాభివృద్ధి సాధించాయన్నారు. స్థానిక సమస్యలు సచివాలయాల ద్వారా ఎప్పటికప్పుడు పరిష్కారం అవుతున్నాయన్నారు. ఈ గ్రామంలో రూ.2.86 కోట్లతో సీసీ, గ్రావెల్ రోడ్లు, రూ. 40 లక్షలతో సీసీ డ్రైన్లు నిర్మించామన్నారు. రూ.1.80 కోట్లతో దివాన్‌చెరువు కూడలి నుంచి శ్రీరామపురం వెళ్లే రోడ్డు ఇరువైపులా పక్కా డ్రైన్లు అభివృద్ధి చేశామని అన్నారు. ఈ అభివృద్ధిని చూసి ప్రజలు వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, పార్టీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నాయకులు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, మెట్ల ఏసుపాదం, పలివెల స్వామి, యర్రంశెట్టి ధర్మరాజు, మార్గాని శ్రీను, పీటర్ తదితరులు పాల్గొన్నారు.



చందన గార్డెన్స్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న చందన నాగేశ్వర్



బొమ్మూరు డైట్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ ఎస్‌డీవీ రమణ



రాజమహేంద్రవరం ప్రియదర్శిని ఆశ్రమంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ గూడూరి శ్రీనివాస్



జిల్లా కోర్టు ఆవరణలో జెండా ఆవిష్కరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

గణతంత్ర సంబరం

- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

రాజమహేంద్రవరం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందించిన రాజ్యాంగ ఫలాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. శుక్రవారం స్థానిక చందన గార్డెన్స్‌లోని ఆయన కార్యాలయంలో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బొమ్మూరు డైట్‌లో ప్రిన్సిపల్ ఎస్‌డీవీ రమణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాజ్యాంగ అంశాలపై నిర్వహించిన క్విజ్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఛాత్రోపాధ్యాయిని తత్వాషినాయ్ వేసిన ఝాన్సీలక్ష్మీబాయి వేషధారణ ఆకట్టుకుంది. బాలభవన్ డిప్యూటీ డైరెక్టర్ ఏఎం జయశ్రీ పాల్గొన్నారు. కాతేరులోని వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ చవాన్‌శ్యామ్ రాజ్‌నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక ఐటీసీఎల్ వద్ద పలుకు చెవిటి, మూగ ఆశ్రమ పాఠశాలలో 17వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చీకురుమిల్లి చిన్న దివ్యాంగులకు స్వీట్లు పంచారు.

మానవసేవే మాధవ సేవ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మానవసేవే మాధవ సేవ అని వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో ఆయన జాతీయ జెండా ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ బధిరులు అసమానులని, వీరిని అమ్మలా తీర్చిదిద్దుతున్న నిర్వాహకురాలు స్వప్నవర్మ సేవలు అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి నామన రాంబాబు, తగరం సురేష్, వంకాల సత్తిబాబు, సాంబ, పాలూరి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కె.ఆశాలత, ప్రేమలత, నిర్మల, ఎలిషారాజ్‌కుమార్, ప్రియాంక పాల్గొన్నారు. అలాగే స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎస్సీ, ఎస్టీ బెంచ్ జడ్జి నాగేశ్వరరావు, 7వ అదనపు జిల్లా జడ్జి బెన్నయ్‌నాయుడు, ఏసీబీ కోర్టు జడ్జి వీవీ ప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

సీటీఆర్ఐ: స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు. డీఆర్వో జి.నరసింహులు, డీపీఓ ఎస్.మాధవరావు, సీపీఓ ఎల్.అప్పలకొండ పాల్గొన్నారు. స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాఘవ కుమారి, వైస్ ప్రిన్సిపాల్ రత్నకుమార్ పాల్గొన్నారు. స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద రాజమహేంద్రి మహిళా జూనియర్ డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో డాక్టర్ కర్రి రామారెడ్డి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో టీకే విశ్వేశ్వరరెడ్డి, సత్య సౌందర్య పాల్గొన్నారు.

కడియం మండలంలో..

కడియం: జేగురుపాడు జీవీకే జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ స్కూళ్లలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు నాగిరెడ్డి వీరశివాజీ, ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు శాకా కిరణ్, బళ్ల అన్నవరం, స్కూల్ చైర్మన్ కేశనపల్లి సత్యనారాయణ, అంబేడ్కర్ యువజన విభాగం అధ్యక్షుడు మద్దుకూరి గోపి పాల్గొన్నారు. పొట్టిలంకలో అంబేడ్కర్ విగ్రహాలకు రిపబ్లికన్ పార్టీ బొజ్జాతారకం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్క వెంకట రత్నరాజు పూలమాలలు వేశారు. కడియం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), శనివాడ లక్ష్మి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. స్కూల్ తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, సర్కార్ భాష, మందపల్లి త్రిమూర్తులు, పున్నమరాజు వీర్రాజు, శిరంశెట్టి మూర్తి పాల్గొన్నారు. పర్యావరణ మిత్రుడు, ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు రాజమహేంద్రవరంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. కడియం సీహెచ్‌సీ గైనకాలజిస్ట్ మోహన్‌వంశీ కూడా సేవా పురస్కారం స్వీకరించారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శం

రాజమహేంద్రవరం సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. స్థానిక నెహ్రూనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతోమంది మహనీయులు ప్రాణాలు పణంగా పెట్టి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను తీసుకొచ్చారన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ బళ్లా సత్యవతి పాల్గొన్నారు. స్థానిక రుడా కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు అందించారు. రుడా వైస్ చైర్మన్ బాలస్వామి, సెక్రటరీ శైలజావల్లి తదితరులు పాల్గొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి కమిషనర్ దినేష్‌కుమార్ నివాళి అర్పించారు. జాతీయ జెండాను ఆవిష్కరించారు.

ధవళేశ్వరం: రిపబ్లిక్ డే వేడుకలను శుక్రవారం ధవళేశ్వరంలో వాడవాడలా నిర్వహించారు. పోలీస్ స్టేషన్ వద్ద సీఐ జి.వినయ్‌మోహన్, పోలవరం ఇరిగేషన్ కార్యాలయం వద్ద ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య జాతీయ జెండాను ఎగురవేశారు.



రుడా కార్యాలయంలో గాంధీకి నివాళులు అర్పిస్తున్న చైర్మన్ సూర్యప్రకాశరావు



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ తేజ్‌భరత్



నెహ్రూనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో జెండా వందనం చేస్తున్న షర్మిలారెడ్డి



జేగురుపాడులో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసిన సర్పంచ్ సతీష్‌చంద్రస్టాలిన్



కడియం జెడ్పీ హైస్కూల్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న గిరిజాల బాబు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్



కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న చిలుకూరి శ్రీనివాసరావు



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న సీహెచ్‌సీ గైనకాలజిస్ట్ మోహన్‌వంశీ

పొదుపు సంఘాలకు ప్రభుత్వ 'ఆసరా'





ఆసరా నమూనా చెక్కు అందిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ, నాగేశ్వర్, షర్మిలారెడ్డి. సభకు హాజరైన మహిళలు

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ
- 688 గ్రూపులకు రూ.3.76 కోట్ల రుణమాఫీ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. శుక్రవారం మెప్మా ఆధ్వర్యంలో స్థానిక ఇన్నీసుపేట బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమానికి ఆయనతో పాటు ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని రూరల్ నియోజకవర్గ ఎనిమిది డివిజన్లలో 688 స్వయం సహాయక సంఘాలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.3.76 కోట్ల రుణమాఫీ చేశారన్నారు. సీఎం జగన్ మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో స్వయం సహాయ సంఘాల సభ్యులకు పావలా వడ్డీ రుణాలు అందిస్తే, నేడు సీఎం జగన్ ఆసరా పథకం ద్వారా డ్వాక్రా మహిళల ఆర్థిక పరిపుష్టికి భరోసా కల్పిస్తున్నారని మంత్రి అన్నారు. 2014లో రుణమాఫీ పేరుతో చంద్రబాబు బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కి అక్కాచెల్లెమ్మలను మోసం చేశాడని, సీఎం జగన్ మాత్రం ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని అన్నారు. ప్రతి ఆడపడుచు వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, రూరల్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు సేవకుడిగా వచ్చిన తనను ఆశీర్వదించాలని మంత్రి కోరారు. పొదుపు సంఘాల మహిళలకు చెక్కును మంత్రి, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మెప్మా ఆధ్వర్యంలో పట్టణ ప్రగతి యూనిట్‌లో భాగంగా సునీతరాణి గ్రూపు సభ్యురాలి కంప్యూటర్ ఎంబ్రాయిడరీ కేంద్రాన్ని మంత్రి వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వివిధ స్టాల్స్‌ను సందర్శించి మహిళలు ఆర్థికంగా బలోపేతం కావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ సత్యవేణి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ రవిశంకర్, నగరపాలక సంస్థ రూరల్ డివిజన్ పార్టీ క్లస్టర్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, జేసీఎస్‌ల ఇన్‌చార్జులు కొప్పిసీడి ప్రసాద్‌బాబు (రాజమౌళి), తాటికొండ విష్ణుమూర్తి, తాడాల చక్రవర్తి, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగ రీజినల్ కో ఆర్డినేటర్ నాగులపల్లి ఆశ, హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి పాల్గొన్నారు.

విద్యతోనే సమసమాజ స్థాపన

- ఎంపీ మార్గాని భరత్‌రామ్
- అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ: విద్యతోనే సమ సమాజ స్థాపన సాధ్యమని, ఈ రంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. శుక్రవారం స్థానిక 50వ డివిజన్ రక్షణాలయం చర్చి వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయం సమ సమాజ స్థాపన అని, దానిని సాధించడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. విద్యతోనే దేనినైనా సాధించగలమని చెప్పారు. అందుకే విద్యారంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి అగ్రతాంబూలం ఇస్తున్నారన్నారు. చదువుకున్న యువత సమాజ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని రాజకీయ రంగంలోకి రావాలని ఎంపీ భరత్‌రామ్ పిలుపునిచ్చారు. రేపటి సమాజాభివృద్ధి యువత చేతిలోనే ఉందన్నారు. అలాగే మనకున్న అమూల్యమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుత్తుల మురళీధర్, అజ్జరపు వసు, కాసే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రకాశంనగర్: దేశంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను భర్తీ చేయాలని మూల్‌నివాసి కర్మచారీ కళ్యాణ్ మహా సంఘ్ జాతీయ అధ్యక్షుడు కె.తిలక్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక దివాన్‌చెరువు డీవీబీ రాజు టౌన్ షిప్‌లో మహా సంఘ్ రాష్ట్ర సదస్సు జరిగింది. దీనికి సంఘ్ జాతీయ అధ్యక్షుడు తిలక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి మొత్తం పది వేల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో ఎస్.గన్నెయ్య, జె.రూఫస్‌రావు, ఎల్.శ్రీనివాసరాజు, ఎస్.శామ్యూల్, యూసఫ్ తదితరులు ప్రసంగించారు .

4 నుంచి బాడీ బిల్డింగ్ పోటీలు

ప్రకాశంనగర్: బొమ్మన రాజ్‌కుమార్ మెమోరియల్ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ పోటీలను ఫిబ్రవరి 4 నుంచి శ్రీగౌతమీ వ్యాయామ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఏవీ రమణమూర్తి అన్నారు. మొత్తం ఏడు విభాగాల్లో బాడీ బిల్డింగ్, రెండు విభాగాల్లో మెన్ ఫిజిక్, ఒక విభాగంలో మాస్టార్స్ జరుగుతాయని చెప్పారు. మొదటి ముగ్గురు విజేతలకు నగదు బహుమతితో పాటు, మెమెంటో, సర్టిఫికెట్‌లను అందజేస్తామన్నారు. విజేతలు ఫిబ్రవరి 22, 23 తేదీల్లో కేరళలో జరిగే సౌత్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో, మార్చి 15, 16, 17 తేదీల్లో తిరుచూర్‌లో జరిగే ఆల్ ఇండియా బాడీ బిల్డింగ్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

జిల్లా క్రికెట్ పోటీలకు సింహాచలనగర్ జట్టు

ప్రకాశంనగర్: ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో స్థానిక క్వారీ ప్రాంతంలోని సింహాచలనగర్ క్రికెట్ జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం స్థానిక మున్సిపల్ స్టేడియంలో ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్స్‌లో సిద్ధార్థనగర్ జట్టుపై సింహాచలనగర్ జట్టు ఘన విజయం సాధించింది. దీంతో జిల్లా పోటీలకు ఎంపికైంది. శ్రీగౌతమీ జీవకారుణ్య సంఘ చైర్మన్ బర్రే కొండబాబు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. క్వారీ ప్రాంతంలోని యువత వివిధ క్రీడల్లో రాణించేందుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు వివరించారు. జిల్లా పోటీల్లోనూ క్రీడాకారులు రాణించాలని ఆయన ఆకాంక్షించారు. జట్టు కెప్టెన్ దేగల వీరతేజ తదితరులు పాల్గొన్నారు.



ఆడుదాం ఆంధ్రా జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైన సింహాచలనగర్ జట్టు

'ప్రేమలో' చిత్ర బృందం సందడి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చందు కోడూరి హీరో, దర్శకుడిగా తెరకెక్కించిన 'ప్రేమలో' చిత్ర బృందం శుక్రవారం నగరంలో సందడి చేసింది. ఈ సినిమా ఎంతో అద్భుతంగా ఉందని, ప్రేక్షకులు ఆదరించాలని నిర్మాత రాజేష్ కోడూరి అన్నారు. శుక్రవారం స్థానిక శివజ్యోతి థియేటర్‌లో ప్రేక్షకులతో కలసి ఈ చిత్రాన్ని నిర్మాత రాజేష్ కోడూరి, ఆయన మిత్ర బృందం బొబ్బిలి పండు, సుక్కిరెడ్డి శ్రీనివాసరావు, వెలమర్తి చిట్టి బ్రహ్మం తదితరులు వీక్షించారు. ఈ సినిమాలో చరిష్మా శ్రీకర్ హీరోయిన్‌గా నటించగా, డ్రీమ్ జోన్ పిక్చర్స్ బ్యానర్‌లో రాజేష్ కోడూరి నిర్మించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం థియేటర్లలో విడుదలైందన్నారు. ఈ చిత్రంలో భారీ ఎమోషన్స్ ఉన్నాయని, కథలో బలం, కాన్సెప్ట్‌లో దమ్ముందని ప్రేక్షకులే వెల్లడిస్తున్నారన్నారు. తొలిరోజు సినిమా వీక్షించిన ప్రేక్షకుల స్పందన చూసి యూనిట్ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సినిమా అంతా గోదావరి తీరం రాజమహేంద్రవరం పరసర ప్రాంతాల్లోనే జరిగిందని రాజేష్ తెలిపారు. కథ, కథనం, దర్శకత్వం బాధ్యతలు చేపడుతూనే.. మరో పక్కన హీరోగా చందు కోడూరి విశేష ప్రతిభ ప్రదర్శించారన్నారు. చిన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరించడం వల్ల మరింత మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రెండు, మూడు రోజుల్లో చిత్రం ప్రదర్శించే థియేటర్ల సంఖ్య పెరగనుందని రాజేష్ కోడూరి తెలిపారు.



శివజ్యోతి థియేటర్‌లో మాట్లాడుతున్న 'ప్రేమలో' చిత్ర నిర్మాత రాజేష్ కోడూరి

అదనపు జీతం ఇవ్వాలి

రాజమహేంద్రవరం సిటీ: అంగన్‌వాడీల సమ్మె కాలంలో వారి విధులనూ నిర్వర్తించిన రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెల జీతాన్ని అదనంగా ప్రభుత్వం మంజూరు చేయాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌రాజు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు.